మూన్నాళ్ల ముచ్చటే..

- మళ్లీ నిషేధిత ప్లాస్టిక్ భూతం స్వైరవిహారం
- నీరుగారిపోతున్న జీవీఎంసీ లక్ష్యం
- గతంలో మాదిరి ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ స్టాళ్లను ఏర్పాటు చేయాలంటున్న పర్యావరణహితులు



జగదాంబ: మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను విడనాడాలని.. గుడ్డ లేదా కాగితం సంచులనే వినియోగించాలని కొన్ని మాసాల క్రితం జీవీఎంసీ అలుపెరుగని పోరాటం చేసింది. ప్రజలకు అవగాహన కలిగించేందుకు క్యాంపెయిన్లు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. నగరంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు పూర్ణామార్కెట్‌లో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిషేధిత ప్లాస్టిక్‌ను ఉపయోగించే వ్యాపారులపై కొరఢా ఝుళిపించింది. మాట వినని వారిపై నిర్దాక్షిణ్యంగా జరిమానాలు విధించింది. ప్రజలను ప్రత్యామ్నాయాల వైపు మళ్లించేందుకు కూడా నడుం బిగించింది. వ్యర్థాలతో తయారు చేసిన కవర్లు, జ్యూట్ బ్యాగ్‌ల విక్రయాలకు ప్రధాన మార్కెట్లలో స్టాళ్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నగరంలోని ప్రధానమైన పూర్ణామార్కెట్ వద్ద మేయర్ గొలగాని హరివెంకటకుమారి, అప్పటి మున్సిపల్ కమిషనర్ రాజాబాబు కలిసి ప్రత్యేక ప్రత్యామ్నాయ ప్లాస్టిక్ విక్రయాల స్టాల్‌ను ప్రారంభించారు. ఇక్కడ నిషేధిత, ప్రాణాపాయ ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్, గుడ్డ, కాగితంతో చేసిన చేతి సంచులను విక్రయాలకు పొందుపరిచారు.

హర్షం వ్యక్తం చేసిన పర్యావరణహితులు

జీవీఎంసీ కృషిని పర్యావరణహితులు ఎంతగానో కొనియాడారు. ఇదే ఊపు మరి కొన్నాళ్లు కొనసాగితే నగరంలో ప్లాస్టిక్ భూతం కనిపించదని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు కూడా మెల్లగా గుడ్డ, కాగితం, జ్యూట్ బ్యాగ్‌ల వాడకానికి అలవాటుపడటం నేర్చుకున్నారు.

పట్టు వదిలేసిన జీవీఎంసీ

నగరంలో చక్కటి మార్పునకు శ్రీకారం చుట్టిన జీవీఎంసీ పనుల ఒత్తిడో.. మరే కారణమో తెలియదు కానీ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గతంలో చూపినంత శ్రద్ధను ఇప్పుడు చూపలేకపోతోంది. దాంతో ప్రజలు, వ్యాపారులు మళ్లీ మహమ్మారి నిషేధిత ప్లాస్టిక్ వైపు మళ్లుతున్నారు. దీంతో లక్ష్యం నీరుగారిపోయింది.

యథావిధిగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగం

చిన్నచిన్న హోటళ్లు, రోడ్డు సైడ్ టిఫిన్ సెంటర్లతో పాటు కాయగూరల దుకాణాల వాళ్లు నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ప్రజలు కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పూర్తిస్థాయిలో నిషేధిత ప్లాస్టిక్‌పై దృష్టి సారిస్తే బాగుంటుందని, గతంలో ప్రారంభించిన ప్రత్యేక ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ స్టాళ్లను పకడ్బందీగా.. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని పర్యావరణహితులు, సామాజికవేత్తలు కోరుతున్నారు.

30 నుంచి బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే స్వామికి జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు తులసి మాలలు సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అర్చనలు, సహస్ర నామాభిషేకాలు నిర్వహించారు.

1న వార్షిక తిరు కల్యాణోత్సవం..

వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఏవో జీవీ రమాబాయి తెలిపారు. 1వ తేదీన ధ్వజారోహణం, ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం 7 గంటల నుండి దేవస్థానం కల్యాణ మండపంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు వివరించారు. 5వ తేదీన చక్రతీర్థం, ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి కార్యక్రమాలు, 6వ తేదీన ఊంజల సేవ, పుష్పాలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎస్వీ కోదండపాణి సంగీతం చిరస్మరణీయం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్

డాబాగార్డెన్స్: తెలుగు చలనచిత్రసీమలో ఎస్పీ కోదండపాణి సంగీతం చిరస్మరణీయమని విశాఖ పోర్టు చైర్మన్ టీకే రామచంద్రన్ పేర్కొన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి 49వ వర్ధంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కె. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మనసా కవ్వించకే నన్నిలా పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరిని పోర్టు చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నలభై రెండేళ్ల వయస్సులో కన్నుమూసిన కోదండపాణి అతి తక్కువ కాలంలో 101 చిత్రాలకు చక్కని బాణీలు కట్టారని చెప్పారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పాటకు, సాహిత్యానికి గౌరవం పెంచేలా సంగీతాన్ని అందించిన మహనీయుడు కోదండపాణి అని కొనియాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ రాంజీ, మాజీ ఏడీసీపీ మహ్మద్‌ఖాన్, బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళా సంఘాల కార్యదర్శి చెన్నా తిరుమలరావు, గంటి మురళీ తదితరులు పాల్గొన్నారు. రాజేంద్రప్రసాద్, శ్రీలత, కూర్మనాథం, శైలజ, కేఎస్ ప్రకాష్, పద్మజ, రమేష్ పట్నాయక్, శ్రీలత, ఫణిభూషణ్, శ్రీలత, జోగారావు తదితరులు తమ గీతాలాపనతో అలరించారు.

వెంకన్నకు విశేష పూజలు



కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



సూరాడ నరేష్ దహన సంస్కారానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుందేటి సుధాకర్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు సొంత నిధుల నుంచి అందజేశారు. అలాగే 38వ వార్డు బుక్కావీధికి చెందిన 25 ఏళ్ల సూరాడ నరేష్ శుక్రవారం పూర్ణామార్కెట్ రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు పార్టీ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే స్పందించి దహన ఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. 30వ వార్డు కోడిపంద్యాల వీధిలో స్థానికంగా నివాసిస్తున్న పార్టీ సీనియర్ కార్యకర్త దళమంతుల రామలక్ష్మి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమెను పరామర్శించి రూ. 5వేలు, 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతానికి చెందిన సచివాలయ కన్వీనర్ వాసంశెట్టి పుష్ప తల్లి దేవి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు తెలుసుకుని మందుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, పార్టీ నాయకులు దళమంతుల చిన్ని, సూర్ని రాము, ఆకుల నాగమణి, రామరాజు తదితరులు ఉన్నారు.

గడప గడపలో 'మా నమ్మకం నువ్వే జగన్'



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న బొర్రా శ్రీనివాసరెడ్డి తదితరులు



ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న పాల శ్రీహరిరెడ్డి, వలంటీర్లు, గృహసారథులు



కుప్పిలివారి వీధిలో లబ్ధిదారుల నుండి అభిప్రాయాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: నియోజకవర్గంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. బొర్రా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వరమెట్ట–2 సచివాలయం పరిధి బంగారుమెట్ట, సీబీఎం స్కూల్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్టిక్కర్ అతికించి వారి ఫోన్ నుంచి మిస్‌కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో గృహసారథులు వావిల్ల చిన్నలక్ష్మి, రమణమ్మ, మంగం పార్వతి, దేవి, రొంగలి శ్రీనివాసరావు, కృష్ణ, వలంటీర్లు పుష్ప, రాణి, పద్మ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ నగర కార్యదర్శి, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో కుమ్మరవీధి సచివాయం పరిధిలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వలంటీర్ గంధవరపు జాన్సీ, గృహసారథులు జయలక్ష్మి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో..

డాబాగార్డెన్స్: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శనివారం తొమ్మిదవ రోజుకి చేరింది. నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు, వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షుల నేతృత్వంలో ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. జీవీఎంసీ 29, 30, 37 వార్డు క్లస్టర్–4 ఇన్‌చార్జి పీతల వాసు నేతృత్వంలో అంగటిదిబ్బ సచివాలయం, కోడిపంద్యాలవీధి, పెయిందొరపేట, ప్రకాశరావుపేట సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, సత్యనారాయణ, దళమంతుల మాణిక్యాలరావు, వడ్డాది దిలీప్, ఆకుల శ్యామ్, డొప్ప సూరిబాబు, రేయి డేవిడ్‌రాజు, నొల్లు చంటి, తమ్మినేని శ్రీను, అడప శివ, గండి పద్మ, కల్యాణి, సారిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బలక్ష్మీనగర్‌లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 41వ వార్డు సుబ్బలక్ష్మీనగర్–2 సచివాలయం పరిధి కుప్పిలి వారి వీధిలో శనివారం చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



స్వామి వారి సన్నిధిలో పోర్టు చైర్మన్ రామచంద్రన్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఐఏఎస్ అధికారి హేమలత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం విశాఖ పోర్టు చైర్మన్ టి.కె.రామచంద్రన్, ఐఏఎస్ అధికారి పి.హేమలత వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు. పోర్టు చైర్మన్ వెంట దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి బాబూకాలనీలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం భూమిపూజ చేశారు. భూగర్భ డ్రైనేజీ రావడం వలన మురుగు సమస్యలు తలెత్తవని తెలిపారు. కార్పొరేటర్ పూర్ణిమ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సుమారు రూ. కోటి నిధులతో పంపింగ్ స్టేషన్ పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 అధికారులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేశంగిణీ రావు, శ్రీను, శ్యామ్, దేవి, ఈశ్వరి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలి



దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న అతిథులు

కంచరపాలెం: దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రొఫెసర్ బి.అప్పారావు అన్నారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ప్రాంగణంలో శనివారం దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో వారికి నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తే స్వయం ఉపాధి ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం పేద దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్, ఒమ్మి కృష్ణ, ఒమ్మి రామరాజు, తిరుపతి గణపతి, గురుమూర్తి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

హృదయాలను హత్తుకున్న నాటకాలు



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: మూడో ప్రపంచ యుద్ధ భయంతో క్షణక్షణం నరకయాతన పడుతూ బతుకీడుస్తున్న కాలంలో సరిహద్దు జీవన గాథే కథాంశంగా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటకం, తల్లిదండ్రుల పేగు బంధంపై ప్రదర్శించిన మనసున మనసై నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఐదో రోజు ప్రదర్శించిన రెండు నాటకాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఈ పోటీలను కస్టమ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్మూలూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

తొలి ప్రదర్శన: 'కొత్త పరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేశాలను కళ్లకు కట్టినట్టుగా చూపారు. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి జాతి, మతం విద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న క్షణాలు.. కన్నీళ్లు పెట్టేలా నటీనటుల ప్రతిభకు పట్టం కట్టారు. జాతి, మతద్వేషాలను అంతం చేసే మానవత్వ విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కరతాళ ధ్వనులతో నటీనటులకు కృతజ్ఞతలు తెలిపారు. కె.కె.స్వామి నాటకాన్ని రచించగా.. బి.ఎం.ఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.

రెండో ప్రదర్శన: 'మనసున మనసై'

ఏలూరుకు చెందిన హేళాపూరి కల్చరల్ అసోసియేషన్ వారిచే మనసున మనసై నాటకం ప్రదర్శించారు. చిన్నతనంలో బడికి వెళ్లిన బిడ్డ తిరిగి ఇంటి కొచ్చే వరకూ ఎదురుచూసే తల్లిదండ్రులు, పెరిగి పెద్దవాడయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తలకొరివి పెట్టడానికి రోజుల తరబడి మార్చురీ బాక్స్‌లో పెట్టి ఎదురుచూసే పరిస్థితుల ఇతివృత్తంగా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకుల మనసును కదిలించింది. చింతల మల్లేశ్వరరావు, పి.కృష్ణ హితేష్‌లు నాటకాన్ని రచించగా.. ఎం.డి.ఖాజావల్లి దర్శకత్వం వహించారు. రెండు గొప్ప నాటకాలను తిలకించామంటూ ప్రేక్షకులు ప్రశంసించారు.

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు

డాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి దండు నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, ఏకపాత్రాభినయాలు, ఫ్లూట్ తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25 లోపల తమ ఎంట్రీలను 9490750661, 9490098794 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చని తెలిపారు.

యూజర్ చార్జీలు చెల్లించాలి

జగదాంబ: జీవీఎంసీకి యూజర్ చార్జీలు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. శనివారం ఆయన సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో యూజర్ చార్జీలు వసూల్ చేయాలని తెలిపారు. ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేసి జోన్‌ను ముందువరసలో నిలిపే బాధ్యత సిబ్బందిదే అన్నారు. ముఖ్యంగా మురికివాడల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దుకాణ సముదాయాలు, హోటళ్లు, ఆస్పత్రుల నుండి యూజర్ చార్జీలు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ ప్రక్షాళన హర్షణీయం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఎస్టీ సెల్‌ను ప్రక్షాళన చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయమై సాక్షి దిన పత్రికలో ఈనెల 12న 'కేజీహెచ్ ఎస్టీ సెల్ ప్రక్షాళన' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి విదితమే. బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు అమలు చేసిన ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ సుమిత్, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఐటీడీఏ పీవో, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు కమిషన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సీతారాం తెలిపారు.

నిరుపేదలను ఆదుకోవాలి

డాబాగార్డెన్స్: నిరుపేదల్ని ఆదుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. పాతనగరం స్వామి వివేకానంద వృద్ధుల ఆశ్రమంలో పలువురు వృద్ధులు, నిరుపేదలకు అన్న, వస్త్ర దాన కార్యక్రమం నిర్వహించారు. అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు దంపతులు స్వామి వివేకానంద సంస్థకు రూ.లక్ష విరాళం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మక్సూద్ అహ్మద్, ఎమ్మెస్సార్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువ కావాలి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

విశాఖ –లీగల్ : ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో చర్చించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు జె.మాధవి, జ్ఞానవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న సీతంరాజు సుధాకర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 38వ వార్డు విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో శనివారం విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం, విశాఖ నగర స్వర్ణకార సంఘం, బ్రహ్మం ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు. విశ్వబ్రాహ్మణులకు అన్ని వేళలా అండగా ఉంటానని, త్వరలోనే ఇక్కడ పెద్ద ఎత్తున వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్, గుండెజబ్బులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు.

యువతి అదృశ్యం



నిహారిక

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న యువతి కోనాడ నిహారిక శుక్రవారం అర్ధరాత్రి దాటాక కనిపించలేదు. వేసవి సెలవుల నేపథ్యంలో తండ్రి నరసింహమూర్తి తన కుమార్తెను జ్ఞానాపురంలో ఉంటున్న బంధువుల ఇంటికి పంపించారు. శుక్రవారం బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిహారిక అర్ధరాత్రి 12 గంటలు అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్. మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

అభాగ్యులకు ఆశ్రయం



పెందుర్తి లయోలా హోమ్‌లో అభాగ్యులను చేర్పించిన మమత

అల్లిపురం: కేజీహెచ్‌లో నలుగురు అభాగ్యులు దిక్కులేక ఎవరో తీసుకువచ్చి చేర్పించటంతో వైద్యం పూర్తయినా వెళ్లలేని పరిస్థితిలో ఉంటే ఆస్పత్రి సిబ్బంది మమత ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు విషయం తెలియజేశారు. దీంతో ఆమె శనివారం వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్ సహకారంతో లయోలా హోమ్‌లో చేర్పించారు.